

శివారు పురపాలికల్లో
44 గ్రామాలు విలీనం?
● స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిపివేత
● కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశం
5

ఏడుపాయల హుండీ ఆదాయం
రూ. 50.28 లక్షలు

పాపన్నపేట, జూలై 30: ఏడుపాయల వనదుర్గాభవాని ఆలయ 70 రోజుల హుండీని మంగళవారం లెక్కించారు. ఛైర్మన్ బాలగౌడ్, ఈవో కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గోకుల్‌షెడ్‌లో రాజరాజేశ్వరి సేవాసమితి సభ్యులు హుండీని లెక్కించారు. బంగారు, వెండి వస్తువులు కాకుండా నగదు రూపంలో రూ. 50,28,595 ఆదాయం దేవాదాయ శాఖకు సమకూరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, పాలకమండలి సభ్యులు వెంకటేశం, మనోహర్, చక్రపాణి, మోహన్‌రావు, పెంటయ్య, నాగభూషణం, రఘు, యాదయ్య, సాయిలు, బాగారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు
సైనికుల్లా పనిచేయాలి

- ఈడీ పురుషోత్తంనాయక్
- ఉత్తమ ఉద్యోగులకు 'ప్రగతి చక్ర' పురస్కారాలు



ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు పురస్కారాలు అందజేస్తున్న ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్

సంగారెడ్డి అర్బన్, జూలై 30 : ఆర్టీసీ ఉద్యోగులు సైనికుల్లా పనిచేయాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. మెదక్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు 'ప్రగతి చక్ర' పురస్కారాలను మంగళవారం అందజేశారు. సంగారెడ్డిలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగులు అంకితభావం, నిబద్ధత, సేవా దృక్పథంతో పనిచేస్తే సంస్థకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభకనబర్చిన 20 మంది డ్రైవర్లు, ముగ్గురు టీం డ్రైవర్లు, 10 మంది కండక్టర్లు, ఐదుగురు గ్యారేజీ కార్మికులు, ఐదుగురు అద్దె బస్సు డ్రైవర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ప్రమాద రహిత వారోత్సవాల్లో భాగంగా 31 సంవత్సరాలుగా ఒక్క యాక్సిడెంట్ చేయకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లు రీజియన్ స్థాయిలో ముగ్గురు, డిపో స్థాయిలో ముగ్గురికి క్యాష్ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎం ప్రభులత, డిప్యూటీ ఆర్ఎం దైవాధీనం, సంగారెడ్డి డీఎం ఉపేందర్, వివిధ డిపోల మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రాజంపేటలో అసంపూర్తిగా ఆరోగ్య ఉప కేంద్ర భవనం

పైసల్లేక.. పనులు సాగక..!

ముందుకుసాగని ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణం

సంగారెడ్డి పట్టణం రాజంపేటకు ఆరోగ్య ఉపకేంద్రం పక్కా భవనం మంజూరైంది. ఆ భవన నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరాయి. భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉన్నా.. నిధులు రాక చివరి దశలో నిలిపేసినట్టు తెలుస్తోంది. కొత్త భవనం అప్పగించకపోవడంతో అంగన్‌వాడీ సెంటర్‌లోనే ఆరోగ్య ఉపకేంద్రం కొనసాగుతున్నది.

సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి సబ్ సెంటర్ సెంటర్ మంజూరైంది. భవన నిర్మాణ పనులు బేస్‌మెంట్ లెవల్, పిల్లర్ల స్థాయి వరకే చేసి నిలిపేశారు. స్వయం సహాయక సంఘాలకు అప్పగించిన పనులు నిధులు లేక మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం సమీపంలోని మరో భవనంలో ఆరోగ్య ఉప కేంద్రం కొనసాగిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో చాలాచోట్ల సబ్ సెంటర్ భవన నిర్మాణాలు నిధుల కొరతతో మధ్యలోనే నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది.

- సంగారెడ్డి జిల్లాలో 124 పక్కా భవనాలు మంజూరు
- ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షల చొప్పున కేటాయింపు
- ఇప్పటివరకు 14 నిర్మాణాలే పూర్తి

సంగారెడ్డి అర్బన్, జూలై 30 : ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను (సబ్ సెంటర్- పల్లెదవాఖానా-హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు) నెలకొల్పింది. వీటికి సొంత భవనాలు నిర్మించేందుకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. కానీ, సకాలంలోని నిధులు మంజూరు చేయకపోవడంతో జిల్లాకు మంజూరైన ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణాలకు గ్రహణం పట్టుకుంది.

వివిధ ఏజెన్సీలకు పనులు

సంగారెడ్డి జిల్లాలో 246 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా.. ఇందులో 124 చోట్ల పక్కా భవనాలను మంజూరు చేస్తూ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ గతేడాది మే 31న ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తూ అప్పటి కలెక్టర్ శరత్ గతేడాది జూలై 10న పాలనపరమైన అనుమతులిచ్చారు. నిర్మాణ పనులను వివిధ ప్రభుత్వ ఏజెన్సీలకు కేటాయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి 81, టీఎస్ఎంఎస్ఐడీసీకి 9, డీఆర్డీఏకు 34 ఆరోగ్య ఉప కేంద్రాల భవనాల నిర్మాణ పనులను కేటాయించారు. టీఎస్ఎంఎస్ఐడీసీ మాత్రమే తనకు కేటాయించిన భవనాల నిర్మాణ పనులను చేపట్టేందుకు సిద్ధమైంది. నామినేషన్ పద్ధతిన కాంట్రాక్టర్లకు కూడా అనుమతి ఇచ్చింది.

వివిధ దశల్లో ఆగిన పనులు

జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలను ప్రభుత్వం మంజూరు చేసిందే తప్ప నిధులు మాత్రం విడుదల చేయకపోవడంతో కొన్ని భవన నిర్మాణ పనులు ముందుకు సాగకపోగా, మరికొన్ని పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంకు కేటాయించిన 81 ఆరోగ్య ఉప కేంద్రాలలో ఇప్పటి వరకు 14 కేంద్రాల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. మరో 31 కేంద్రాలు నిర్మాణ దశలో ఉండగా, 36 కేంద్రాలు ఇంకా ప్రారంభించనేలేదు. ఈ 36 కేంద్రాలు కూడా డబ్బులు లేవన్న కారణంతో పనులు చేసేందుకు కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రావడం లేదు. ఇక మిగతా ఏడు కేంద్రాలకు టెండర్లు దశలో ఉన్నాయని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇక డీఆర్డీఏకు కేటాయించిన 34 ఆరోగ్య ఉప కేంద్రాలను స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. ఇందులో ఏడు కేంద్రాల భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. 27 కేంద్రాలకు భవన నిర్మాణాలను మొదలు పెట్టనేలేదు. వీటి పనులు ప్రారంభించాలని ఒక్కో కేంద్రంకు రూ.2 లక్షల చొప్పున స్వయం సహాయక సంఘాలకు అడ్వాన్సుగా అప్పటి కలెక్టర్ విడుదల చేశారు. అయినా మిగిలిన డబ్బుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని నిర్మాణాలను మొదలుపెట్టేందుకు స్వయం సహాయక సంఘాలు ముందుకు రావడం లేదు. ఇలా ఉండగా స్థలం కేటాయించకపోవడంతో టీఎస్ఎంఎస్ఐడీసీకి కేటాయించిన తొమ్మిది ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలను ఇప్పటి వరకు చేపట్టలేదు.



ఫసల్‌వాదిలో పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయిన ఆరోగ్య ఉపకేంద్రం

నిధులు విడుదల చేయని వైద్యశాఖ

ఆరోగ్య ఉప కేంద్రాల నిర్మాణాలు పూర్తయిన వాటిని నిధులు విడుదల చేయాలని ఆయా ఇంజనీరింగ్ అధికారులు డీఎంహెచ్‌వోకు లేఖ రాసినా స్పందించడం లేదని భవన నిర్మాణ బాధ్యతలు చేపట్టిన ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు ఆరోపిస్తున్నారు. పైసలు లేకుండా పనులు ఎలా చేపడతామంటూ కాంట్రాక్టర్లు ఎదురు ప్రశ్నిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. జిల్లాలో సబ్ సెంటర్ల నిర్మాణానికి సంబంధించి రూ.14 కోట్లు కలెక్టర్ ఆధీనంలోనే ఉన్నాయి. కానీ, నిధులు విడుదల చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు లేఖ రాయాల్సి ఉన్నా.. పట్టించుకోకపోవడంతో నిధులు విడుదల కావడంలేదనే విమర్శలున్నాయి. వైద్యశాఖ అధికారులే ఉన్నతాధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆయా శాఖల ఇంజనీరింగ్ అధికారులు పేర్కొనడం గమనార్హం. మరోవైపు భవన నిర్మాణం పూర్తిచేయడానికి రూ.20 లక్షలు సరిపోవని, కనీసం రూ.28 లక్షలైనా అవసరమవుతాయని గుత్తేదారులు పేర్కొంటున్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యవహిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి నిధులు విడుదల చేయించి ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణ పనులను పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.



రైతులకు రెండో విడత రుణమాఫీ చెక్కులను అందజేస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జిల్లాలో రూ.286.76 కోట్లు

రెండో విడత రుణమాఫీతో 27,249 మందికి లబ్ధి : కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, జూలై 30 : రెండో విడత రుణమాఫీలో భాగంగా రూ. లక్షన్నర లోపు రుణాలున్న 27,249 మంది రైతులకు రూ.286.76 కోట్లు ఖాతాల్లో జమ చేసినట్లు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ రైతులకు రుణమాఫీకి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత రుణమాఫీలో 51,167 మంది రైతులకు రూ. 279.62 కోట్ల రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. బ్యాంకు సిబ్బంది వెంటనే రుణమాఫీ చేసి కొత్త రుణాలు అందజేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డుల పొరపాట్ల కారణంగా రుణమాఫీ జాబితాలో పేర్లు రానివారు వ్యవసాయ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణమాఫీ జరిగేలా చూడాలని సూచించారు. రుణమాఫీలో ఇబ్బందులు పడే రైతుల కోసం జిల్లా స్థాయిలో సమాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 08455-4562276 నంబర్‌కు ఫోన్ చేసి రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అంబికాసోని, బ్యాంకర్లు పాల్గొన్నారు.

డీసీసీబీల్లో కొందరికే..

జిల్లాలోని డీసీసీబీల్లో సగం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు తెలిసింది. డీసీసీబీల పరిధిలో 8,500 మంది రైతులకు రూ.108 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. కానీ రెండో విడతలో 6200 మంది రైతులకు రూ. 51 కోట్లు మాత్రమే మాఫీ అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. మిగిలిన రైతులు రుణమాఫీపై ఆందోళన చెందుతున్నారు.

మహిళల అభివృద్ధికే 'మహిళాశక్తి'

సంగారెడ్డి కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి మంగళశారం సమావేశమయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకే రాష్ట్ర ప్రభుత్వం మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించి రుణాలు అందజేస్తున్నదని తెలిపారు. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం మహిళలకు సహాయ సహకారాలు అందజేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, పీడీడీఆర్‌డీఏ జ్యోతి, డీఆర్డఈవో జంగారెడ్డి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మూడు బోర్లు.. ఆరు ట్యాంకర్లు..!

పటాన్‌చెరు పారిశ్రామికవాడలో నీటి దందా



మెడికల్ డివైజ్ పార్కు పక్కన అసైన్డ్ భూమిలో బోరు వేసి నీటి దందా

- ట్యాంకర్‌కు రూ.300-రూ.500
- ఖాతాపై పరిశ్రమలకు సరఫరా
- భూగర్భ జలాలు తోడేస్తూ
- రూ. లక్షలు గడిస్తున్న అక్రమార్కులు

పటాన్‌చెరు, జూలై 30: పటాన్‌చెరు నియోజకవర్గంలో అక్రమ నీటి వ్యాపారం మూడు బోర్లు.. ఆరు ట్యాంకర్లుగా వర్ధిల్లుతున్నది. భూగర్భ జలాలను నిరంతరంగా తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్ద ఎత్తున ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ వల్టా చట్టానికి సవాలు విసురుతున్నారు. ఇష్టారాజ్యంగా బోర్లు వేసి నీటిని అమ్ముకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అరికట్టాల్సి రెవెన్యూ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. నిబంధనల ప్రకారం గృహ అవసరాలకు బోరు వేయాలన్నా తహసీల్దార్ అనుమతి తప్పనిసరి. పొలాల వద్ద వ్యవసాయ అవసరాలకు మాత్రమే బోర్లు వేసుకునేందుకు అనుమతి ఉంది. కానీ ఎక్కడా గుంట సాగు చేయకుండా బోర్లు మాత్రం వేసి నీటిని విక్రయిస్తున్నారు.

నీటి ట్యాంకర్లకు గిరాకీ

ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమల్లో పెద్దఎత్తున నీరు అవసరం. పటాన్‌చెరు, పాషమైలారం, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కు, ఐడీఏ బొల్లారం పారిశ్రామివాడల్లో పెద్దఎత్తున ఈ పరిశ్రమలు ఉండగా.. నీటి కొరత వేధిస్తున్నది. పారిశ్రామికవాడలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో పరిశ్రమల్లోని బోర్లలో స్వచ్ఛమైన నీరు రావడం లేదు. దీంతో, నీటిని తరలించే వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం వందలాది ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారు. పాషమైలారం పక్కనే పదుల సంఖ్యలో బోర్లు ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నాయి. లక్షలాది లీటర్ల నీటిని నిల్వ చేసే భారీ సంపులను నిర్మించుకుని 24 గంటలు నీటి వ్యాపారం చేస్తున్నారు. నీటి వ్యాపారులకు పరిశ్రమల్లో ఖాతాలున్నాయి. నెలాఖరున లెక్క చూసుకుని చెక్కులు తీసుకుంటున్నారు. పెద్దగా పెట్టుబడి లేకుండా విపరీతమైన రాబడి ఉండడంతో నీటి దందా పెద్దఎత్తున సాగుతున్నది.

పుట్టగొడుగుల్లా బోర్లు

పటాన్‌చెరు మండలం పాషమైలారం పారిశ్రామికవాడ చుట్టుపక్కల అసైన్డ్, వ్యవసాయ భూముల్లో పుట్టగొడుగుల్లా బోర్లు వేసి నీటిని తోడుస్తున్నారు. నిత్యం వందలాది ట్యాంకర్లతో తరలిస్తున్నారు. అలాగే, చిట్కుల్ పంచాయతీ పరిధిలో పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సైతం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకుని సైడ్ బిజినెస్ కొనసాగిస్తున్నారు. నీటి వ్యాపారులు సిండికేట్‌గా మారి కొత్తవారు ఈ వ్యాపారంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, జానకంపేట, వడక్‌పల్లి, దాయర, గండిగూడ, ఐలాపూర్, ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల నీటి వ్యాపారం ఇష్టారాజ్యంగా సాగుతోంది. అమీన్‌పూర్, బీరంగూడా, మియాపూర్, బొల్లారం, బాచుపల్లి తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచే ట్యాంకర్ల సరఫరా జరుగుతోంది. బొల్లారంలోని రసాయన పరిశ్రమలకు, సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కులోని పరిశ్రమలకు ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది. వీటితోపాటు ప్రైవేటు కళాశాలల హాస్టళ్లకు, హోటళ్లకు, నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లకు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలకు నీటి సరఫరా చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా కరెంటు కనెక్షన్లు

బోర్లువేసి నీటిని విక్రయించడం అక్రమమని తెలిసినా ట్రాన్స్‌కో సిబ్బంది నీటి దందాకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి మీటర్లను ఏర్పాటు చేయడం గమనార్హం. సుల్తాన్‌పూర్, దాయర, గండిగూడ, కిష్టారెడ్డిపేట, ఐలాపూర్ తండా ప్రాంతాలలో వాటర్ ప్లాంట్ల పేరుతో వాణిజ్య కనెక్షన్‌లు తీసుకుని ప్లాంట్లను నడపకుండా నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నారు. 24 గంటలు బోర్లను నడిపించి, పక్కనే పిట్లలో నిల్వ చేస్తున్నారు. ట్యాంకర్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్యాంకర్లకు నీటిని విక్రయించి వేలల్లో వసూలు చేస్తున్నారు. నీటి దందాపై అమీన్‌పూర్ తహసీల్దార్ స్పందిస్తూ నీటి వ్యాపారం చేసేవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులు ఇక.. రుణ విముక్తులు

మెదక్ జిల్లాలో 21,517 మందికి రూ.202.98 కోట్లు మాఫీ : మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూలై 30 రైతులను రుణ విముక్తులను చేయడానికే ప్రభుత్వం రుణమాఫీ అమలు చేస్తున్నదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతురుణమాఫీ- 2024లో భాగంగా మంగళవారం స్థానిక సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో విడత రుణమాఫీలో భాగంగా జిల్లాలో 21,517 మంది రైతులకు రూ.202.98 కోట్లు నిధులు జమచేయడం జరిగిందన్నారు. రూ. లక్షన్నర లోపు పంట రుణాలను మాఫీ చేస్తూ, రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. ఇప్పటికే మొదటి విడతలో 47,968 మంది రైతులకు రూ.238.81 కోట్లు అకౌంట్లలో జమ చేశామని వివరించారు. మొత్తం ఈ రెండు విడతల్లో జిల్లా వ్యాప్తంగా 69,495 మంది రైతులకు రూ.441.79 కోట్లు జమ చేశామన్నారు. రుణమాఫీకి సంబంధించిన సందేహాల నివృత్తికి ప్రత్యేక ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రుణమాఫీపై రైతుల్ని, బ్యాంకులను సమన్వయపర్చాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా సహకార శాఖ అధికారి కరుణ, లీడ్‌బ్యాంక్ జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, వ్యవసాయశాఖ అధికారులు, ప్రాథమిక సహకార సంఘం నాయకులు, సిబ్బంది, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలో 331 మందిపై హిస్టరీ షీట్లు

- సత్ప్రవర్తన కలిగినవారికి విముక్తి
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 30 : సంగారెడ్డి జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా, దొంగతనాలు, మహిళలపై జరుగుతున్న నేరాలకు పాల్పడిన 331 మంది నేరస్తులపై హిస్టరీషీట్లు తెరిచినట్టు ఎస్పీ చెన్నూరి రూపేష్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గంజాయి సాగు, అక్రమ రవాణా చేసినా, అమ్మినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రెండు వారాలుగా జిల్లావ్యాప్తంగా రౌడీషీటర్లు, నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వివరించారు. సత్ప్రవర్తన కలిగిన పలువురిపై రౌడీషీట్లు మూసేయడం జరిగిందని తెలియజేశారు. అలవాటుగా నేరాలు చేసేవారిపై పీడీయాక్టు కింద కేసులు నమోదు చేసి హిస్టరీషీట్లు తెరుస్తామని చెప్పారు. జిల్లాలో మాదకద్రవ్యాల సాగు, సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా 8712656777 నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజల జీవనానికి ఇబ్బందులు కలిగిస్తూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

సూరారంలో ఇంటింటికీ వైద్య పరీక్షలు

- మరో 20 మందికి జ్వరం
- గ్రామాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌వో శ్రీరామ్



సూరారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీరామ్

చిన్నశంకరంపేట, జూలై 30: చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో ఇంటర్ విద్యార్థి డెంగీతో మృతి నేపథ్యంలో గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలో మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పరిశీలించారు. జ్వరంతో బాధపడేవారి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫీవర్‌సర్వే చేయకపోవడంపై ఏఎన్ఎంలు, ఆశావర్కర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వైద్య సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని హెచ్చరించారు. జర్వంతో బాధపడుతున్నవారి వివరాలను సేకరించి ఫోన్ నంబర్‌తో సహా రికార్డు చేయాలని ఆదేశించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామంలో 20 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. వారందరకీ ఎప్పటికప్పుడు వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఇద్దరికి ప్లేట్‌లెట్స్ తగ్గడంతో జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మురుగుకాల్వలు, పరిసరాల్లో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం మెడికల్ క్యాంపు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎమ్‌హెచ్‌వో అనీల, జిల్లా మలేరియా అధికారులు విజయేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన చికిత్స

కౌడిపల్లి: మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన జింక దుర్గాప్రసాద్, చాకలి మహేష్ డెంగీతో బాధపడుతున్నట్టు తెలుసుకుని డీఎంహెచ్‌వో శ్రీరామ్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో హెల్త్‌క్యాంపు ఏర్పాటు చేసి అవసరమున్న వారికి చికిత్స అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం డెంగీతో బాధపడుతున్న ఇద్దరు కోలుకున్నారని తెలిపారు.

మహాలక్ష్మి పథకంతో పెరిగిన రేషియో

● మెదక్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ప్రభులత

సిద్దిపేట అర్బన్, జూలై 30: మహాలక్ష్మి పథకంలో భాగంగా మెదక్ ఆర్టీసీ రీజియన్‌లో ప్రతిరోజు లక్షా 70 వేలమంది ప్రయాణం చేస్తున్నారని, పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటివరకు ఉచిత ప్రయాణాన్ని మూడు కోట్ల 800 లక్షల మంది మహిళలు వినియోగించుకున్నారని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత మంగళవారం తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టక ముందు 70 శాతం ఉన్న ఆక్యుపెన్సీ రేషియో నేడు 98 శాతానికి చేరిందన్నారు. గతంలో ప్రతిరోజు సుమారు 1,80,000 మంది ప్రయాణం చేస్తే.. నేడు 2.60 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారని ఆమె తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా మెదక్ రీజియన్‌లో 10 డీలక్స్, 35 పల్లె వెలుగు, 42 ఎక్స్‌ప్రెస్ బస్సులు మొత్తంగా 87 కొత్త బస్సులు వచ్చాయన్నారు. ప్రయాణికుల సంఖ్య పెంచడానికి గిఫ్ట్ స్కీం పథకాన్ని కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మెరుగైన ఆరోగ్యం కోసం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అలాగే ప్రయాణికులతో మెదులుకునే ప్రవర్తనపై కూడా శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించడానికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు.



తుర్కపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

● ఐదు తులాల బంగారం, 70 తులాల వెండి అపహరణ

నారాయణఖేడ్, జూలై 30: తాళం వేసిన ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారు. నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన కుర్మ ఆంజిగొండ తల్లి కిష్టమ్మతో కలిసి ఖేడ్‌లో బంధువు అంత్యక్రియలు వెళ్లాడు. ఆంజిగొండ భార్య శారద మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రాత్రి 7 గంటలకు తల్లి కిష్టమ్మ, భార్య శారద ఇంటికి వచ్చి పరిశీలించగా బీరువా తాళం తీసి ఉండడంతో వెళ్లి చూడగా.. 5 తులాల బంగారు ఆభరణాలు, 70 తులాల వెండి ఆభరణాలు, రూ.32 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.


జీడిపల్లిలో మూడు తులాలు చోరీ


మనోహరాబాద్, జూలై 30: మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో కూడా చోరీ జరిగింది. ఎస్ఐ సుభాష్ గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోల్లబోయిన శేఖర్ కుటుంబీకులతో కలిసి పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 8 గంటలకు వచ్చారు. ఇంట్లోకి వెళ్లి చూడగా సామాను చిందరవందరగా పడి ఉన్నది. అనుమానం వచ్చి బీరువాలో చూడగా.. 3 తులాల బంగారం, కొంత నగదును అపహరించారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణఖేడ్, జూలై 30: నిజాంపేట మండల కేంద్రానికి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. నిజాంపేట మండలం రాంరెడ్డిపేట్ గ్రామానికి చెందిన గూల రమేష్(27) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో నిజాంపేట శివారులో 161వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

























అధ్వానంగా అంగన్‌వాడీలు

- సొంత భవనాలు లేక తీవ్ర అవస్థలు
- ఇరుకు గదులు, అద్దె భవనాల్లో కొనసాగింపు
- శిథిలావస్థలో 34 భవనాలు
- పెండింగ్ బిల్లులతో సిబ్బంది ఇక్కట్లు

జోగిపేట, జూలై 30: అందోలు నియోజకవర్గంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు అధ్వానంగా ఉన్నాయి. అద్దె గృహాలు, సౌకర్యవంతంగా లేని గదులు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. దీంతో పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులను కేంద్రాలకు పంపడానికి ఇష్టపడడం లేదు.

అద్దె భవనాల్లో 65 కేంద్రాలు

నియోజకవర్గంలో మొత్తం 450 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 175 కేంద్రాలు సొంత భవనాల్లో నడుస్తుండగా, 141 కేంద్రాలు ఆయా గ్రామాల్లోని పాఠశాలలలకు అనుబంధంగా స్కూల్ బిల్డింగ్ లలో, మరో 141 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో సరైన వసతులు లేక, ఇరుకుగదుల్లో, అసౌకర్యాల నడుమ చిన్నారులు గడపాల్సిన దుస్థితి నెలకొన్నది. నియోజకవర్గంలోని 9 మండలాల్లో 65 కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అద్దె డబ్బులు రాకపోవడంతో టీచర్లకు భారమవుతోంది.

శిథిలావస్థలో 34 కేంద్రాలు

నియోజకవర్గం మొత్తంగా 34 కేంద్రాలు శిథిలావస్థలో ఉన్నట్టు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. వీటిలో అత్యధికంగా జోగిపేట సీడీపీవో పరిధిలోనే 23 కేంద్రాలు ఉండడం గమనార్హం. ముఖ్యంగా సంగుపేట, అల్మాయిపేట, అందోలు-1, మిన్‌పూర్, సింగూరు-2, ఖాదిరాబాద్, -1, మేడికుంద, దేవునూర్, ఇబ్రహీంపూర్ తదితర కేంద్రాల పైకప్పులు చిన్నపాటి వర్షాలకే కురుస్తున్నాయి. అల్లాదుర్గం మండలం గొల్లకుండ గిరిజనతండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులే లేవు. కొండారెడ్డిపల్లి, ఎర్రారం, మిన్‌పూర్, గొంగులూర్, పుల్కల్-3, కోడూరు, సింగూరు, పెద్దారెడ్డిపేట, కొర్పోల్, కేరూర్, గౌతాపూర్, పల్వట్ల, బిజిలీపూర్, ఖాదిరాబాద్, పాలడుగు, దేవునూర్ కేంద్రాల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పూర్తిగా ధ్వంసమైంది. మునిపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లోని కేంద్రం పెంకుటింట్లో ఉండడంతో, చిన్నపాటి వర్షాలకు కురుస్తోంది.


సంగుపేట కేంద్రంలో పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీటిని పట్టేందుకు ఏర్పాటు చేసిన గిన్నెలు

పోస్టుల ఖాళీ

నియోజకవర్గంలోని అంగన్‌వాడీల కేంద్రాల్లో సిబ్బంది లేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. జోగిపేట సీడీపీవోగా నియమితులైన నర్సింహారావు మూడేళ్లుగా హైదరాబాద్ ప్రధాన కార్యాలయానికి డిప్యూటేషన్ చేయించుకుని విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతోఅసిస్టెంట్ సీడీపీవో ప్రియాంక ఇన్‌చార్జి సీడీపీవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అల్లాదుర్గం సీడీపీవోగా నియామకమైన లిఖిత ఇక్కడి రాకుండానే హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో నర్సాపూర్ సీడీపీవో హేమభార్గవి ఇన్‌చార్జి సీడీపీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అల్లాదుర్గం ఏసీడీపీవోగా జ్ఞానేశ్వరి బాధ్యతలు తీసుకున్నరోజే సెలవు పెట్టి.. వారంరోజుల వ్యవధిలో నిజామాబాద్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఏసీడీపీవో పోస్ట్ ఖాళీగా ఉంది. జోగిపేట ఐసీడీఎస్ ప్రాజక్టులో ఒక సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఒక టైపిస్ట్, ఒక అటెండర్ పోస్టు ఖాళీగా ఉన్నది. 10 సూపర్‌వైజర్ పోస్టులకు ఏడుగురు పనిచేస్తుండగా.. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జోగిపేట ఐసీడీఎస్ పరిధిలో 262 మంది అంగన్‌వాడీ టీచర్లకు 256 మంది మాత్రమే పనిచేస్తుండగా, 6 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అల్లాదుర్గం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 9 సూపర్‌వైజర్ పోస్టులకు కేవలం ఐదుగురినే ప్రభుత్వం నియమించిందది. వీరిలో ఒకరు హైదరాబాద్‌కు డిప్యూటేషన్‌పై వెళ్లగా.. ఒకరు విధుల్లో ఉండగా.. 4పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

5 నెలలుగా అందని కూరగాయల బిల్లులు

బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వమే పోషకాహారాన్ని అందిస్తోంది. ఇందులతో భాగమైన కూరగాయల విషయంలోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒకరికి రోజుకు రూ.1.50 చొప్పున ప్రతినెలా కూరగాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది. కానీ ఐదునెలలుగా బిల్లులు రాకపోవడంతో టీచర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. సర్దుకోండని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో సాధ్యం కావడం లేదని వాపోతున్నారు.


శిథిలావస్థకు చేరిన అందోలులోని అంగన్‌వాడీ కేంద్రం


చౌటకూర్ మండలం హొన్నాపూర్‌లో నిలిచిన భవనం పనులు

సమస్యలు తీర్చాలి

అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న తమకు కూరగాయల బిల్లుల భరించడం ఇబ్బంది అవుతుంది. సక్రమంగా వేతనాలు, కూరగాయల బిల్లులు చెల్లించాలి. పక్కా భవనాలు నిర్మించాలి. చిన్నారులకు ఆట వస్తువులు సమకూర్చాలి.

- ఇందిరాగౌడ్, జోగిపేట డివిజన్ అంగన్‌వాడీ టీచర్ల సంఘం అధ్యక్షురాలు

చోరీ చేశాడని ఆరోపణ.. ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య

- న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన


గుగులోత్ కుమార్ (ఫైల్)

శివ్వంపేట, జూలై 30: అనుమానాస్పదస్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని వెంక్యాతండాలో చోటు చేసుకున్నది. కాగా న్యాయం చేయాలని సంగారెడ్డి-తూప్రాన్ జాతీయ రహదారి శివ్వంపేటలో పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు ఆందోళన చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధి రెడ్యాతండా పంచాయతీ పరిధిలోని వెంక్యాతండాకు చెందిన గుగులోత్ కుమార్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి ట్రాక్టర్ బ్యాటరీ చోరీ చేశాడని ఆరోపిస్తూ.. కుమార్‌ను స్థానికులు చితకబాది కుటుంబీకులకు అప్పగించారు. ఈ క్రమంలో అవమానంతోనే కుమార్ మృతిచెందాడని బంధువులు ఆరోపిస్తూ.. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

గజ్వేల్, జూలై 30: మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గజ్వేల్ పట్టణంలో చోటుచేసుకున్నది. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కుతాడి అలియాస్ పద్మిని సత్యనారాయణ(59)కి ఇద్దరు భార్యలు, మొదటి భార్య లక్ష్మి దౌల్తాబాద్‌లో ఉంటుండగా.. రెండోభార్య సత్యలక్ష్మి గజ్వేల్ పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇంటిలో ఉంటున్నది. సత్యలక్ష్మితో కలిసి ఉంటున్న సత్యనారాయణ మద్యానికి బానిసకావడంతో ఆరోగ్యం పాడైంది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన సత్యనారాయణ సోమవారం రాత్రి డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు. మొదటి భార్యకు కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

దుబ్బాక, జూలై 30: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి దుబ్బాక మండలం రాజక్కపేటలో చోటుచేసుకున్నది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన తిరుపతియాదవ్(74) తన కుమార్తె ఇల్లు అయిన రాజక్కపేట గ్రామానికి వచ్చాడు. కుమార్తె వ్యవసాయ పొలం వద్ద ఒడ్లపై గడ్డిని కోస్తుండగా.. ప్రమాదవశాత్తు స్టాటర్ డబ్బాకు చెందిన విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు చూసి కుమార్తెకు సమాచారమందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి


పంగ స్వామి(ఫైల్)

రాయపోల్, జూలై 30: రెండురోజుల క్రితం ఇంట్లో గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబసభ్యులు, ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ స్వామి(35) ఐదేళ్ల క్రితం అప్పుచేసి ఇల్లు కట్టుకున్నాడు. ఏడాది క్రితం మరింత అప్పు చేసి ఆటో కొనుగోలు చేశాడు. ఇంటికి, ఆటోకు కలిపి మొత్తం రూ.3 లక్షల వరకు అప్పులు అయ్యాయి. చేసిన అప్పులు తీరకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండునెలల క్రితం ఆటోను అమ్మేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై 28న అర్ధరాత్రి ఇంట్లో గడ్డి మందు తాగాడు. అనంతరం భార్యను నిద్రలేపి తాను గడ్డిమందు తాగానని చెప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు ఆయనను గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి 13 ఏళ్ల కొడుకు ఉన్నాడు. మృతుడి భార్య కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రసాయన వ్యర్థ జలాలు తాగి పాడిఆవు మృతి


మృతిచెందిన ఆవు

జిన్నారం, జూలై 30: కాజీపల్లి పారిశ్రామికవాడలో మేతకు వెళ్లిన ఆవు కాలుష్య జలాలు తాగి మృత్యువాత పడింది. కాజీపల్లికి చెందిన యువరైతు అభిమన్యుకు చెందిన పాడిగేదెలు, ఆవులు సోమవారం మేత కోసం గ్రామ శివారులోని పారిశ్రామికవాడ సమీపంలోకి వెళ్లగా రసాయన వ్యర్థ జలాలు తాగి మృత్యువాత పడినట్లు బాధితుడు తెలిపాడు. మరణించిన ఆవు విలువ రూ.లక్ష ఉంటుందన్నారు. తరచూ కాలుష్య జలాలు సేవించి పశువులు మరణిస్తున్నాయని అభిమన్యు ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇస్రో ప్రయోగాలపై అవగాహన


ఇస్రో ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

తూప్రాన్, జూలై 30: ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న పరిశోధన ప్రయోగాలపై విద్యార్థులు తెలుసుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్రో శాస్త్రవేత్తల పరిశోధన ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భారతీయ అంతరిక్షా పరిశోధన సంస్థ గగన్‌యాన్-3పై ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. చంద్రయాన్-3 విజయవంతమై ఏడాది అయిన సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మామిండ్ల కృష్ణ, పల్లెర్ల రవీందర్‌గుప్తా, నేత మహేందర్‌రెడ్డి, రఘుపతి, కృషి విజ్ఞాన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, తహసీల్దార్ విజయలక్ష్మి, కమిషనర్ ఖాజా మొయిజొద్దీన్, ఇస్రో శాస్త్రవేత్తలు శంకరప్రసాద్, డాక్టర్ రాగమల్ల శ్రీనివాస్, టెక్నికల్ ఆఫీసర్ సుజయ్, ప్రధానోపాధ్యాయురాలు ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

ఖేడ్ మార్కెట్ చైర్మన్ పదవి ఎవరిని వరించునో..?

- మొదటిసారి ఎస్సీ జనరల్‌కు పదవి రిజర్వు
- ఆశల పల్లకిలో పలువురు ఎస్సీ నేతలు


ఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

నారాయణఖేడ్, జూలై 30: సంగారెడ్డి జిల్లాలోనే మారుమూల ప్రాంతంలో ఉన్న నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ఖేడ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటుచేసిన అనంతరం మొదటిసారిగా ఎస్సీ సామాజికవర్గానికి చైర్మన్ పదవిని రిజర్వ్ చేయడంతో.. ఆ సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఖేడ్ నియోజకవర్గం 1994కు పూర్వం జోగిపేట వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఉండేది. అప్పట్లో విభజన చేసి నారాయణఖేడ్‌లో ప్రత్యేకంగా మార్కెట్ కమిటీని ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి ఓసీ, బీసీ సామాజికవర్గాలకు చెందినవారు చైర్మన్లుగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఎంపీగా సురేష్‌షెట్కార్ కొనసాగుతున్నారు. దీంతో పార్టీకి చెందిన ఎస్సీ సామాజికవర్గం నాయకులు పదవి కోసం ఇరువురు నేతలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. చైర్మన్ పదవి కోసం కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌కు చెందిన దేవిదాస్, కంగ్టి మండలం చీమల్‌పాడ్‌కు చెందిన మాజీ జడ్పీటీసీ రవి, మనూరు మండలం శెల్గిరకు చెందిన మాజీ జడ్పీటీసీ పురంజన్, నారాయణఖేడ్ మండలంజి.హుక్రానకు చెందిన అమృత్, సంజీవన్‌రావుపేటకు చెందిన సాయిలు, కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన బందారు సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంజయ్‌రాం, నాగల్‌గిద్ద మండలం ఎర్రబొగుడకు చెందిన స్వామిదాస్, తదితరులు నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కల్హేర్ మండలం క్రిష్ణాపూర్‌కు చెందిన దేవిదాస్, తండ్రి నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. దివంగత కిష్టారెడ్డికి అనుచరుడిగా పనిచేయడమే కాకుండా పార్టీ జెండా మోస్తూ వస్తున్నాడు. జి.హుక్రాను చెందిన అమృత్ సైతం కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. పార్టీ అధిష్టానం మాత్రం నారాయణఖేడ్‌లో ఉప ఎన్నిక జరిగిన సమయంలో పార్టీని వీడకుండా, పార్టీ జెండా మోసిన వారికే చైర్మన్ పదవిని కట్టబెట్టాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది. ఏదిఏమైనా నారాయణఖేడ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశావహుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. దీంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. చైర్మన్ పదవినే కాకుండా వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవుల కోసం కూడా ఎంపీ, ఎమ్మెల్యేల వద్ద పదవులను ఆశిస్తున్నవారు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నట్లు తెలుస్తోంది.

కేసుల విచారణలో లోపాలుంటే సహించేది లేదు

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ చెన్నూరి రూపేష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూలై 30: కేసుల విచారణలో లోపాలుంటే సహించేది లేదని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు అడిగి తెలుసుకుంటూ కేసుల విచారణలో జాప్యం ఉండొద్దన్నారు. ప్రతి కేసులో నాణ్యమైన విచారణ చేసి బాధితులకు అండగా నిలవాలన్నారు. పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నివారణకు ప్రత్యేక దృష్టిసారించి ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ప్రమాద హెచ్చరికా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫేక్ నంబర్ ప్లేట్లు, నంబరు లేని వాహనాలపై దృష్టిసారించాలని తెలిపారు. నేర నియంత్రణకు ఉపయోగపడే సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ రమేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివారు పురపాలికల్లో 44 గ్రామాలు విలీనం?

- ఎన్నికల ప్రక్రియ నిలిపివేత
- కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటయ్యే అవకాశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న 44 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ గ్రామాలను సమీపంలోని పురపాలక సంఘాల్లో విలీనం చేసే కసరత్తు మొదలుపెట్టింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు మొదటివారంలోగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఇటీవల ప్రభుత్వం అధికారులకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే నగర శివార్లలోని ఔటర్ రింగురోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ చేపట్టరాదని తాజాగా ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. దీనిపై అధికారులు ఎవరూ మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. కానీ గ్రామాల విలీన ప్రక్రియపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని ఈ గ్రామాలన్నీ ఔటర్ రింగురోడ్డుకు ఇరువైపుల అనుకున్న గ్రామాలే. ఇందులో రంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు ఉండగా మిగతావి మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఇప్పటికే మున్సిపాలిటీగా ఉన్న ప్రాంతంలో ఎక్కువ గ్రామాలు కలిస్తే వీటిని కార్పొరేషన్ చేయాలని నిర్ణయించారు. ఇలా శివార్లలో కొత్తగా రెండు కార్పొరేషన్లు ఏర్పాటుకానున్నట్లు తెలిసింది. దీనికి ఇంకా తుది రూపు రావాల్సి ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం

- సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు

జహీరాబాద్, జూలై 30: ఆయిల్‌పామ్ సాగుతో రైతుల ఆదాయం రెట్టింపు అవుతుందని సంగారెడ్డి జిల్లా ఉద్యానశాఖ అధికారి సోమేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం పట్టణ సమీపం రంజోల్ గ్రామంలోని బాబానగర్‌లో రైతు తిరుపతిరెడ్డి పొలంలో చేపట్టిన ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మెగా ప్లాంటేషన్‌లో భాగంగా 2024-25 సంవత్సరానికిగానూ జిల్లావ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటలను రైతులు సాగుచేస్తున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 12 మండలాల్లో రైతులు ఆయిల్‌పామ్ పంటను సాగు చేసున్నారని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు, తదితరాలను సరఫరాచేసే గోద్రేజ్ కర్మాగారం డీజీఎం స్వీటీ మాట్లాడుతూ రైతుల డిమాండ్ మేరకు తమవంతు బాధ్యతగా సహకరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు శ్రీధర్, శైలజ, ఏఈవో ప్రదీప్, రైతులు, గోద్రేజ్ సంస్థ అధికారులు బొంతు భరత్, వెంకటేశం, రాజేష్‌రెడ్డి, కేతన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీం కెప్టెన్‌గా చైతన్యశ్రీ


చైతన్యశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చిన్నకోడూరు, జూలై 30: అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీంకు కెప్టెన్‌గా సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని వడ్లకొండ చైతన్యశ్రీ ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ భూపాల్‌రాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యశ్రీకి కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. జాతీయస్థాయిలో రాణించాలని వారు ఆకాక్షించారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ బోనాలు



కోహిర్: దిగ్వాల్‌లో పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపులో భక్తులు

ఆశాఢ బోనాల సందర్భంగా మంగళవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కోహీర్ జులై 30: మండల పరిధిలోని దిగ్వాల్, కవేలి, తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం మహిళలు పెద్ద సంఖ్యలో తమ తమ గ్రామదేవతల ఆలయాల వద్దకు వెళ్లి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. బాజాభజంత్రీలు, పోతురాజుల విన్యాసాల మధ్య గ్రామ దేవతల ఆలయాల వరకు ఊరేగింపుగా వెళ్లి బోనాలు సమర్పించారు.



కంది: చిమ్నాపూర్‌లో గ్రామంలో బోనాల ఉత్సవాల్లో శివసత్తుల శిగాలు



ఝరాసంగం: వనంపల్లి గ్రామంలో బోనాలతో మహిళల ఊరేగింపు

● కంది: మండలంలోని చిమ్నాపూర్‌లో మంగళవారం మాజీ ఆత్మకమిటీ చైర్మన్ వడ్డెపల్లి కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో గౌడ కులస్థులు బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలను ఊరేగించారు. ఊరేగింపులో శివసత్తుల శిగాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ శివారులోని రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

● గుమ్మడిదల: మండలం బొంతపల్లి గ్రామంలో ఎల్లమ్మ బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి నైవేద్యంతోపాటు పూజలు నిర్వహించారు. అనంతరం పోతురాజు విన్యాసాలతో పాటు పలు కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి పూజలు చేశారు.

● ఝరాసంగం: మండల పరిధిలోని వనంపల్లి గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలకు బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామంలోని పోచమ్మ, ఊరడమ్మ గ్రామ దేవతలకు మహిళలు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హత్నూరలో ఉచిత వైద్య శిబిరం

హత్నూర, జూలై 30: మండల కేంద్రంలో నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మల్లారెడ్డి, నారాయణ ఉచిత వైద్య శిబిరం హత్నూర గ్రామంలో మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్ ప్రారంభించారు. శిబిరంలో ప్రజలకు బీపీ, షుగర్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు ప్రవళిక, నిహారిక సిబ్బంది సునీత, ఓబుల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, బీఆర్ఎ్‌స్‌నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణపరిషత్‌కు రూ. వందకోట్లు కేటాయించాలి

చేగుంట, జూలై 30: తెలంగాణ ప్రభుత్వం 2024-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో తెలంగాణ బ్రాహ్మణ్ సంక్షేమ పరిషత్‌కు రూ. 50 కోట్లు కేటాయించడం పట్ల బాహ్మణ సేవాసంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ శర్మ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రూ.100 కోట్లు ప్రకటించగా కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50 కోట్లు మాత్రమే ప్రకటించిందని, దానిని 100 కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



పాపన్నపేటలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

పాపన్నపేట, జూలై 30: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.7 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలో ఏబీవీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల విద్యార్థులు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అలాగే ఫీజు నియంత్రణ చట్టం అమలు చేసి ఫీజుల దోపిడిని అరికట్టాలంటూ పలు డిమాండ్లు చేశారు. ధర్నాలో ఏబీవీపీ మండల నాయకులు రాజు, శ్రీకాంత్, కళాశాల విద్యార్థులు తేజ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ప్రయోజనం

జహీరాబాద్, జూలై 30: సేంద్రియ వ్యవసాయ సాగుతో రైతులకు, కొనుగోలుచేసే వినియోగదారులకు మరింత ప్రయోజనం ఉంటుందని కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, సాయి ప్రియాంక పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రాలయోలకళాశాలలో చదువుతున్న 14మంది విద్యార్థులు అవగాహన, శిక్షణార్థం డీడీఎస్-కేవీకేకు వచ్చారు. అందులో భాగంగా మంగళవారం వారికి కాశీంపూర్, తదితర ప్రాంతాల్లో లింగాకర్షక బుట్టలను వాడేవిధానం, పండుఈగల నివారణ, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి

● దక్షిణతెలంగాణ దక్కన్‌టోల్వే రీజనల్‌హెడ్ వినీష్‌కుమార్

జహీరాబాద్, జూలై 30: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకుని భవిష్యత్తులో ఉన్నతమైన హోదాల్లో ఉండేందుకు కృషి చేయాలని దక్షిణ తెలంగాణ దక్కన్‌టోల్వే రీజనల్‌హెడ్ వినీష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో రూ.2కోట్ల వ్యయంతో ఎల్అండ్‌టీ ఆధ్వర్యంలో 6 అదనపు గదులను నిర్మించారు. మంగళవారం వాటిని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎల్అండ్‌టీ ఆధ్వర్యంలో రోడ్లను నిర్మిస్తూ సమీపగ్రామాల్లో ప్రజల అవసరాల దృష్ట్యా సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. పట్టణంలోగల జూనియర్ కళాశాలలో తరగతిగదుల కొరత ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని ప్రిన్సిపాల్ సుమలత, స్థానికులు తెలుపడంతో తాము ముందుకు వచ్చిన కళాశాలలో అదనపుతరగతి గదుల నిర్మాణం కోసం కృషి చేశామన్నారు. డెక్కన్‌టోల్వేవారు సంగారెడ్డి నుంచి కర్ణాటక మీదుగ మహారాష్ట్ర సరిహద్దు వరకు 145 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారిని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, ఎల్అండ్‌టీ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేవరకూ వదలం: బీజేపీ





సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి రూరల్, జూలై 30: ఎన్నికల సమయంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు వదిలిపెట్టబోమని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తే బీసీ కులాలను ఏకం చేసి బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికలను బహిష్కరిస్తామని గోదావరి అంజిరెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, జిల్లా ఉపాధ్యక్షుడు పోచారం రాములు, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, జిల్లా నాయకులు మందుల నాగరాజు, కిసిని వాసు పాల్గొన్నారు.

● మెదక్ అర్బన్, జూలై 30: అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీ ఏమైందని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రశ్నించారు. ఓబీసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. నేతలను లోనికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో బీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, శివకుమార్, రమేష్ వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నివాసాల క్రమబద్ధీకరణ చేయాలి

జిన్నారం/గుమ్మడిదల, జూలై 30: నివాసాల క్రమబద్ధీకరణ కోసం జీవో 59 కింద డబ్బులు చెల్లించిన అర్హులైన పేదలకు న్యాయం చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో ఒక రోజు ధర్నా నిర్వహించారు. మంగళవారం బొల్లారం మున్సిపాలిటీ పాత కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2023 వరకు మూడు పర్యాయాలు నివాసాల క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసి డబ్బులు చెల్లించిన బాధితులకు నేటికీ రెగ్యూలరైజేషన్ చేయలేదని బాధితులు వాపోయారు. నెల రోజుల్లో బాధితులకు న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆనందకృష్ణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేఘనారెడ్డి, శ్రవంతి, రవీందర్‌రెడ్డి, శివలక్ష్మన్, రాఘవేందర్ రెడ్డి, శ్రీకాంత్‌చారి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో 59 జీవో నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఒకరోజు నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు అర్హులతో పాటు బీజేపీ నాయకులు ఉదయం నుండి సాయంత్రం ఐదు గంటల వరకు దీక్ష చేపట్టి నిరసన తెలియజేశారు.

అనుమతి ఒక చోట.. తవ్వకం మరోచోట

● చర్చనీయాంశంగా రెవెన్యూ అధికారుల తీరు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండాపూర్ గ్రామస్థులు

మనోహరాబాద్, జూలై 30: రెవెన్యూ సిబ్బందికి మట్టి అనుమతి పేరిట అనుమతి పత్రాలను సమర్పించినా అటు వైపు కనీసం నిక్కిచూడని సిబ్బంది తీరు చర్చనీయాంశంగా మారింది. మండలంలోని కొండాపూర్ గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శివారు పరిధి రంగాయపల్లి గ్రామ శివారులో సర్వే నెంబరు 231లో పరిశ్రమ యజమాని జిల్లా మైనింగ్ శాఖ ద్వారా జూలై 4 నుంచి ఆగస్టు 2తేదీ లోపు మట్టి తరలింపునకు అనుమతి పొందాడు. ఆ కాపీని రెవెన్యూ కార్యాలయానికి అందజేశాడు. దీంతో పరిశ్రమ యజమాని అనుమతి పేరుతో మట్టిని గత నెల రోజుల నుంచి పరిశ్రమకు తరలించారు. అయితే అనుమతి పొందిన 231 సర్వే నెంబరులోని మట్టిని తీయకుండా 154 సర్వే నెంబర్ నుంచి మట్టిని తరలించాడు. ఇది గమనించిన కొండాపూర్ గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్‌ను అడగగా వారి అనుమతి పత్రాలను చూపించారు. అయితే పరిశ్రమ యజమాని అనుమతి పొందిన సర్వే నంబర్ 231లో కాకుండా 154 సర్వేనంబర్ నుంచి మట్టిని తరలిస్తున్నాడని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి రెండు ఎక్స్‌వేటర్లను, ఒక టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

● మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, జూలై 30: బాలల సంరక్షణ మన అందరి బాధ్యత అని జిల్లా చైర్‌పర్సన్, ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కోర్టు అవరణలో ప్లాన్ ఇండియా(ఎన్జీవో) సేవలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. బాలల హక్కులను రక్షించడం కోసం ప్లాన్ ఇండియా జిల్లాలోని వివిధ శాఖల అధికారులలో కలిసి పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రిటా లాల్‌చంద్, ఎన్జీవో నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నిజాంపేట, జూలై 30: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తున్నామని మెదక్ ఆర్డీఓ రమాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజున సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల మధ్యాహ్న భోజన నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని పల్లె దావఖాన తోపాటు, నూతనంగా ఏర్పాటు చేస్తున్న తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ సురేష్ కుమార్ ఆర్ ఐ గంగాధర్ గౌడ్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు జ్ఞానమాల, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడిగా సాయికుమార్ రెడ్డి

సంగారెడ్డి రూరల్, జూలై 30 : బీజేవైఎం సంగారెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడిగా సాయికుమార్‌రెడ్డిని నియమిస్తూ మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కు, తనకు ఎంపిక చేసేందుకు సహకరించినవారికి కృతజ్ఞతలు తెలిపారు.

కొల్చారంలో ఉపాధిహామీ పనుల నిర్వహణ భేష్

● డీఆర్డీవో సీహెచ్ శ్రీనివాసరావు

కొల్చారం, జూలై 30: కొల్చారం మండలంలో చేపట్టిన ఉపాధిహామీ పనుల నిర్వహణ భేష్ అని డీఆర్డీవో సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 21గ్రామ పంచాయతీలలో గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి 14వ విడత సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ నుంచి 29వ తేది వరకు ప్రత్యేక బృందాల ద్వారా సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. సంవత్సర కాలానికి రూ. 5,47,94,095 పనులు జరుగగా అన్ని పనులు బాగానే ఉన్నట్లు బృందాల పరిశీలనలో వెల్లడైందన్నారు. కాగా సోషల్ ఆడిట్‌లో రూ. 65,434 దుర్వినియోగం జరిగినట్లు గుర్తించామన్నారు. ఇందులో రూ. 47,435 లను సిబ్బంది నుంచి రికవరీ చేయగా, రూ.18వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రజా దర్బార్‌లో అడిషనల్ డీఆర్డీవో రంగాచారి, క్వాలిటీ కంట్రోల్ రమాకాంత్, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, విజిలెన్స్ సంపత్, ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఏఈ పీఆర్ ఇర్ఫాన్ హుస్సేన్, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేదలకు కల్యాణలక్ష్మి వరం

మెదక్ అర్బన్, జూలై 30: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరంలాంటిదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన హవేళీఘణపూర్ మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ సర్కార్ అందించే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు శేఖర్, లింగం, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, వివిధ మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఉద్యోగి మృతి



భిక్షపతి(ఫైల్)

శివ్వంపేట, జూలై 30: గుర్తుతెలియని వాహనం ఢీకొని మిషన్ భగీరథ క్షేత్రస్థాయి ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన చండి గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు భిక్షపతి(55) గతంలో వీఆర్ఏగా విధులు నిర్వహించి మిషన్ భగీరథ శాఖకు బదిలీ అయ్యారు. ఏడాది కాలంగా మిషన్ భగీరథలో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధి నిర్వహణలో భాగంగా గంగయ్యపల్లి నుంచి శివ్వంపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా చండిగ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కొడుకు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..



విజయ్‌కుమార్(ఫైల్)

పెద్దశంకరంపేట, జూలై 30: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న పెద్దశంకరంపేట ప్రియాంకకాలనీకి చెందినవడ్ల విజయ్‌కుమార్(32) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మూడురోజుల క్రితం రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా చికిత్సపొందుతూ మండలం మృతి చెందాడు. మృతుడికి భార్య, 11 నెలల కూతురు ఉన్నట్లు కాలనీవాసులు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

మెదక్‌లో వాహన తనిఖీలు

రామాయంపేట, జూలై 30: రామయంపేట-మెదక్ రోడ్డులో మంగళవారం సాయంత్రం పోలీసు తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రంజిత్ నేతృత్వంలో సిబ్బంది వచ్చే వెళ్లే వాహనాలను నిలిపి డ్రైవింగ్ లైసెన్సు తదితర పత్రాలను పరిశీలించారు. అలాగే నంబర్ ప్లేట్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు. 32 ద్విచక్ర వాహనాల యజమానులకు ఫైన్ వేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజలకు రక్షణ కల్పించాలి: డీఎస్పీ

నిజాంపేట, జూలై 30: ప్రజలకు రక్షణ, భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో భాగంగా నిజాంపేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని, ప్రతిరోజూ వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అలాగే సైబర్ మోసాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటరాజు గౌడ్, ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్ఐ జైపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, రైటర్ వినోద్ నవీన్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి



ఉద్యోగవిరమణ పొందిన హెచ్ఎం అశోక్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ నాయకులు

వట్‌పల్లి/పెద్దశంకరంపేట, జూలై 30 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ సంఘం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. వట్‌పల్లిలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కుమార్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం వట్‌పల్లి మండలం మేడికుంద శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో అశోక్‌కుమార్ దంపతులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో 22 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 34 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు చేయడంలో పీఆర్టీయూ సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మన్, గౌరవ అధ్యక్షులు ప్రభు, మానస పత్రిక సంపాదకవర్గ సభ్యులు మాణయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మన్, ప్రధానకార్యదర్శి సిద్ధేశ్వర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మూసాపేట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ ఉద్యోగ విరమణ సభను పెద్దశంకరంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు సుభాష్ దంపతులను ఎమ్మెల్సీతో పాటు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పబ్బని శ్రీనివాస్, మంగలికృష్ణ, మండలనోడల్ అధికారి డి.వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్, విఠల్, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఫలితాలు సాధించాలి: డీఈవో

జిన్నారం, జూలై 30: బొల్లారం ప్రభుత్వ పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పదవ తరగతిలో వందశాతం ఫలితాల సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పాఠశాలల నిర్వాహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్టీ గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

జిన్నారం, జూలై 30: జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 5నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆగస్టు 1న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, జిల్లాకు చెందిన ఎస్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

నేడు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

సంగారెడ్డి అర్బన్, జూలై 30 : సంగారెడ్డిలోని సంజీవనగర్ భవిత కేంద్రంలో దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించేందుకు అర్హుల గుర్తింపును ఈ నెల 31న నిర్వహిస్తున్నట్టు డీఈవో వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని అన్ని పాఠశాలల్లోని అవసరమున్న దివ్యాంగ విద్యార్థులు హాజరయ్యేట్టు చూడాలని సూచించారు. రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, ఇతర అవసరమైన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

సదరం క్యాంపునకు 116 మంది

సంగారెడ్డి అర్బన్, జూలై 30: దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 116 మంది సదరం క్యాంపునకు హాజరయ్యారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ తెలిపారు.

ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

నారాయణఖేడ్, జూలై 30: శ్యాంప్రసాద్‌ముఖర్జీ రూర్బన్ పథకం కింద నారాయణఖేడ్ మండలం పోతన్‌పల్లిలో ఏర్పాటు చేస్తున్న ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ పనులను మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. రూర్బన్ పథకం ద్వారా నారాయణఖేడ్ మండలం ర్యాకల్ క్లస్టర్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందులో భాగంగా 2001లో నారాయణఖేడ్‌కు చెందిన గ్రామీణ సైంటిస్టు పాండురంగారావు రీసైక్లింగ్ యూనిట్‌ను ప్రభుత్వ రుణంతో ఏర్పాటు చేశారు. షెడ్డు విస్తరణకు మరో రూ.20 లక్షలు అవసరమని పాండురంగారావు ప్రభుత్వాన్ని కోరడంతో అదనపు కలెక్టర్ పోతన్‌పల్లిని సందర్శించి యూనిట్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఐకేపీ, రెవెన్యు, సిబ్బంది ఉన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలుతున్నవారి అరెస్టులు

టేక్మాల్/మనోహరాబాద్/కోహీర్/వెల్దురి, జూలై 30: రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా టేక్మాల్ మండలంలోని ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా మనోహరాబాద్ మండలంలో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్‌ను పోలీసులు ముందస్తుగా అతడి ఇంటి వద్ద అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కోహీర్‌లో పలువురు పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా కార్మికులను ముందస్తుగా అరెస్టు చేయడం న్యాయం కాదని సీఐటీయూ వెల్దుర్తి మండల కార్యదర్శి గౌరి విమర్శించారు.

బడి ఇలాగుంటే చదువులెలా?



శిథిలావస్థకు చేరిన చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాల

- శిథిలావస్థలో చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాల
- చిన్న వర్షానికే ఊరుస్తున్న గదులు
- అదనపు గది నిర్మించినా పెచ్చులూడి పెంకుటింటి వరండాలోనే బోధన
- 'మన ఊరు- మనబడి'కి ఎంపిక కాక కనీస మరమ్మత్తులకు నోచుకోని వైనం
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



తరగతి గది పెంకులపై టార్పాలిన్ కప్పిన దృశ్యం







తరగతిగదిలో వర్షం నీరు, పెచ్చులూడిన శ్లాబు, ఇరుకు గదిలోనే బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కంది, జూలై 30: సంగారెడ్డి జిల్లా కేంద్రానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కంది మండలం చిమ్నాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరింది. 1 నుంచి 5వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, 30 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల్లో చిమ్నాపూర్ గ్రామానికి చెందిన వారు 20 మంది ఉండగా, ఆ గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న చిమ్నాపూర్ తండా నుంచి మరో 10 మంది వస్తున్నారు. పాఠశాల పైభాగం మొత్తం పెచ్చులూడి నేడో, రేపో కూలిపోయే దశలో ఉన్నది. అంతేకాకుండా వర్షం పడితే చాలు పాఠశాలలో మరింత అధ్వాన పరిస్థితి. ఉన్న రెండు తరగతి గదులు ఊరుస్తుండడంతో వాన చినుకుల నీరంతా తరగతి గదుల్లోకి చేరి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామస్థులు కొందరు పాఠశాల దుస్థితి చూడలేక పెంకుటింటిపై టార్పాలిన్ కప్పించినప్పటికీ ఫలితం లేదు. కాగా జిల్లా కేంద్రానికి ఇంత దగ్గరగా దుస్థితిలో ఉన్న ఈ పాఠశాల 'మన ఊరి- మనబడి' పథకం కింద ఎంపిక చేయకపోవడంతో కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడం విద్యార్థులకు పాలిట శాపంగా మారింది. కనీసం ఆడుకోవటానికి ఆట స్థలం కూడా లేక విద్యార్థులు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. గత సంవత్సరం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా రూ. 4 లక్షలు మంజూరైనప్పటికీ ఆ నిధులతో ఎలాంటి మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక ఎంతో మంది పేద విద్యార్థులు ప్రైవేటును ఆశ్రయించక తప్పడం లేదని గ్రామస్థులు వాపోయారు. చిమ్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఇన్ని సమస్యలు నెలకొన్నా విద్యాశాఖ అధికారులు ఎవరూ ఇటువైప కన్నెత్తి చూడడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

పక్కా భవనం నిర్మించాలి



ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పక్కా భవనం లేక నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరింత అధ్వానంగా తయారవుతుంది. అందర్నీ ఒకే తరగతి గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నాం. ప్రస్తుతం ఉన్న పెంకుటిల్లు, శ్లాబ్‌తో నిర్మించిన గదులు చిరుజల్లులు కురిసినా ఉరుస్తున్నాయి. వర్షం పడితే దిక్కుతోచని స్థితిలో పాఠశాల పరిస్థితి మారింది. విద్యార్థులు ఆడుకునేందుకు కనీసం ఆట స్థలం కూడా లేదు. ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి పాఠశాలకు సౌకర్యాలు కల్పించాలి.

- అఫ్జల్, హెచ్ఎం, చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాల, కంది మండలం

పాత పెంకుటిల్లు, వరండాలే దిక్కు

చిమ్నాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రెండు తరగతి గదులు ఉన్నాయి. అందులో పాత పెంకుటింటిలో ఒక తరగతి గదిలోనే హెచ్ఎం కార్యాలయ నిర్వహణ కూడా అందులోనే జరుగుతుంది. 15 సంవత్సరాల క్రితం పెంకుటిల్లు తరగతి గది పక్కనే సిమెంటు స్లాబుతో పక్కా భవనం నిర్మించారు. అయితే స్లాబుతో నిర్మించిన పక్కా భవనం పెచ్చులూడి అధ్వానంగా మారగా, ఎప్పుడో కొన్నేళ్ల కిందట నిర్మించి శిథిలావస్థకు చేరిన పెంకుటిల్లే విద్యార్థులకు పెద్దదిక్కయ్యింది. తరగతులన్నీ పెంకుటిల్లు, దాని పక్కనే వరండాలో నిర్వహిస్తున్నారు.

వర్షం పడితే తప్పని ఇక్కట్లు

తండా నుంచి చిమ్నాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి రావాలంటే విద్యార్థులు కిలోమీటర్ నడవాల్సిన పరిస్థితి. వర్షం పడినప్పుడు పాఠశాలకు వెళ్లాలంటే రోడ్డు సరిగా లేక తీవ్ర ఇబ్బందులెదురవుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ తండా విద్యార్థుల కోసం పాఠాలు చెప్పేందుకు ఒక టీచర్ ఉన్నప్పటికీ పాఠశాల భవనం లేక ఆ టీచర్‌ను విద్యార్థులతో పాటే చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో కలిపేశారు. చిమ్నాపూర్ తండాపై విద్యాశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని తండావాసులు ఆరోపిస్తున్నారు.

గాజిరెడ్డిపల్లి పాఠశాలదీ అదే తీరు

హవేళీఘణపూర్, జూలై 30: మండలంలోని గాజిరెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మూడు తరగతి గదులున్నాయి. అందులో రెండు తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. మూడు గదులో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. ఐదు తరగతుల్లో మొత్తం 60 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న చిరుజల్లులకు తరగతి గదుల పైకప్పు పెచ్చులూడి పడింది. బీటలు వారి లోపలికి వర్షం నీరు ఊరుస్తున్నది. దీంతో మిగిలిన ఒక్క గదిలోనే 60మంది విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి నూతన గదులు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడి పడిన క్లాసరూం